అన్నదాతపై వడ్డీ భారం

- వడ్డీ రాయితీ, బీమా ప్రీమియం అందించని కూటమి ప్రభుత్వం
- వన్‌బీ, అడంగల్ కోసం రైతుల ఇక్కట్లు
- కొనసాగుతున్న ఖరీఫ్ రుణాల రెన్యూవల్స్



రుణాల రెన్యూవల్ కోసం వచ్చిన రైతులు

కనగానపల్లి: బ్యాంకుల్లో రైతుల ఖరీఫ్ పంట రుణాల రెన్యూవల్స్ కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం రైతులు మే, జూన్ నెలల్లో ఎక్కువగా పంట రుణాలు తీసుకొంటారు. కొత్త రుణాలతో పాటు గతంలో తీసుకొన్న రుణాలను రైతులు ఇప్పుడే రెన్యూవల్ చేసుకొంటారు. రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఖరీఫ్ రుణాల రెన్యూవల్స్ జోరుగా సాగుతోంది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట ఎక్కువగా సాగు చేసే కనగానపల్లి, రాప్తాడు, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో ఈ పంట రుణాలు తీసుకుంటారు. నియోజకవర్గంలో ఏటా సుమారు 65 వేల మంది రైతులు పంట రుణాలు తీసుకుంటున్నట్లు సమాచారం.

పెరిగిన వడ్డీ భారం

ఖరీఫ్ పంట రుణాలు రెన్యూవల్ చేసుకొనే ఈసారి వడ్డీ భారం బాగా పెరిగిందని రైతులు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంట రుణాలు తీసుకొనే రైతులకు రూ.లక్ష సున్నా వడ్డీతో రుణాలు అందించటంతో పాటు మిగిలిన వారికి 3 శాతం వడ్డీ రాయితీ కల్పించేవారు. కాని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతా రైతులకు సున్నా వడ్డీ రుణాలు ఎత్తివేయటంతో పాటు వడ్డీ రాయితీ కల్పించటంలేదు. దీంతో రైతులు 7 శాతంపైగా వడ్డీ చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకొంటున్నారు. బ్యాంకు ఖర్చులతో కలసి రూ.లక్ష రుణానికి రూ.9 వేల వరకు వడ్డీ చెల్లించవలసి వస్తోందని రైతులు తెలిపారు. దీనికి తోడు పంటల బీమా చేసుకొనేందుకు చెల్లించే ప్రీమియం సొమ్ము కూడా గతంలో ప్రభుత్వమే చెల్లించేంటున్నారు. కాని ఈ సంవత్సరం ఇటువంటి రాయితీలు ఏమి లేకపోవటంతో రుణాలు రెన్యూవల్ చేసుకొనేందుకు భారంగా మారిందని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన రైతులు వాపోతున్నారు.

వన్‌బీ, అడంగల్ కోసం ప్రదక్షిణలు

బ్యాంకులో పంట రుణాలు పొందాలంటే రైతులు తాము సాగుచేస్తున్న భూముల వివరాలు తెలిపే వన్‌బీ, అడంగల్ కాపీలను అందజేయాలి. కాని ప్రస్తుతం చాలా గ్రామాల్లో ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగల్ కాపీలు రావటం లేదని రైతులు చెపుతున్నారు. ముఖ్యంగా భూముల రీ సర్వే జరుగుతున్న రెవెన్యూ గ్రామాల్లో ఈ కాపీలు సరిగా రావడం లేదంటున్నారు. వీటి కోసం రోజూ రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మీ భూమి వెబ్‌సైట్‌లో తీసుకొన్న అడంగల్ కాపీలపై ఖచ్చితంగా వీఆర్వోతో పాటు తహసీల్దార్ సంతకం ఉండాలని బ్యాంకు అధికారులు నిబంధనలు పెడుతున్నారు. దీంతో రైతులు వీటిని కోసం మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కేంద్రాల వద్దకు తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తోంది.

ఇబ్బందులు పడుతున్నాం..

గత ప్రభుత్వ హయాంలో సున్నా వడ్డీకి రుణాలు తీసుకున్నాం. ఎటువంటి వడ్డీ, బీమా ప్రీమియం చెల్లించకుండా పంట రుణాలు రెన్యూవల్ చేసుకున్నాం. ప్రస్తుతం రూ.లక్ష రుణం తీసుకున్న వారు కూడా రూ.9 వేల దాకా వడ్డీ చెల్లిస్తున్నాం. దీనికి తోడు పంటల బీమాకు ప్రీమియం సొమ్ము కూడా రైతులే కట్టాలని బ్యాంకర్లు చెబుతున్నారు. దీంతో రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటే భారంగా మారింది.

– నారాయణప్ప, వేపకుంట

ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగల్ రావడం లేదు

రుణాలు రెన్యూవల్ చేసుకునేందుకు వన్‌బీ, అడంగల్ కాపీలు తప్పనిసరిగా ఉండాలని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కాని ఆన్‌లైన్‌లో ఆ కాపీలు రావడం లేదు. దీంతో వీటి కోసం రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టు తిరుగుతున్నాం. అయితే అధికారులు ఒక్కోసారి అందుబాటులో లేకపోతే రెన్యూవల్ చేసుకొనేందుకు ఆలస్యం అవుతోంది.

– వెంకటరాముడు, ముక్తాపురం

సకాలంలో రెన్యూవల్ చేసుకోండి

రైతులు సకాలంలో పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి. రుణం తీసుకుని ఒక ఏడాది గడువు దాటితే వడ్డీ శాతం పెరగడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు వర్తించవు. ఈ సంవత్సరం గ్రామీణ బ్యాంకులన్నింటినీ విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చారు. గతంలో ఉన్న కొన్ని బ్యాంకు నిబంధనలు మారాయి. వాటిని అనుసరించి రైతులకు పంట రుణాలు అందజేస్తాం.

– గుణప్రసాద్, మేనేజర్, కనగానపల్లి గ్రామీణ బ్యాంక్

క్లుప్తంగా

సమ్మె జయప్రదం చేయండి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

కదిరి టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. బుధవారం స్థానిక ఎన్జీఓ భవన్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు సీఐటీయూ నాయకులు, యూటీఎఫ్ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమ్మెలో అన్ని రంగాల ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, బాబ్జాన్, ముస్తాక్, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, మాబున్నీసా, శంకర్, తిరుపాల్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

ధర్మవరం అర్బన్: పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియతో పాటు రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అందరిలోనూ తీవ్ర ఆందోళన కలిగిస్తున్నందున ఈ నెల 15న మంగళగిరి సమీపంలోని ఆత్మకూరు విద్యాభవన్ వద్ద చేపట్టే రాష్ట్రస్థాయి ధర్నా జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

కదిరి అర్బన్: బాల్య వివాహాలను నిర్మూలించాలని అధికారులు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో బాల్యవివాహాలపై చైల్డ్ ఫండ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సచివాలయ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్ర నాయక్, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప, మండల విద్యాధికారులు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాలతో అమ్మాయిలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ హాల్లో చైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రహ్లాద ఒక ప్రకటనలో తెలిపారు. 20 వార్డుల్లో జరిగిన, జరగబోవు అభివృద్ధి పనులను గురించి చర్చిస్తామని పేర్కొన్నారు. వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు హాజరు కావాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం తన సిబ్బందితో కలిసి మల్లాకాలువలో గ్రామ సభ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతు గ్రామస్తులు గొడవలకు దూరంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మద్యానికి బానిస కాకూడదన్నారు. పేకాట, జూదం వంటి వాటి జోలికి వెళ్లరాదన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్


పట్టుబడిన పేకాటరాయుళ్లు

తనకల్లు: గోళ్లవారిపల్లి వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.51,620 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతే ధ్యేయం


కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కుంటాల పుల్లయ్య

తాడిమర్రి: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ పటిష్టతే ధ్యేయంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రామాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ కుంటాల పుల్లయ్య వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షునిగా నియమితులయ్యారు. దీంతో బుధవారం కుంటాల పుల్లయ్య మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ధర్మవరంలోని కేతిరెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా ఆయన్ను కలిశారు. కేతిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయాలన్నారు. అనంతరం కుంటాల పుల్లయ్య మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామంజినేయులు, ఎంపీటీసీ చంద్రబాబు, నాయకులు ఆర్వేటి కాటమయ్య, ఆర్వేటి గురుప్రసాద్, ఆర్వేటి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వండి


పర్యాటక రంగంపై కలెక్టర్‌తో చర్చిస్తున్న కంపెనీ ప్రతినిధులు, ఎమ్మెల్యే

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తిలో పర్యాటక అభివృద్ధికి చేయూతనివ్వాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి జోయాలుక్కాస్ కంపెనీ ప్రతినిధులను కోరారు. బుధవారం ఎమ్మెల్యే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లా పర్యాటక అధికారి నరసయ్య, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద జోయాలుక్కాస్ పంపెనీ ప్రతినిధి రోబిన్‌తో కలసి పుట్టపర్తిలోని శిల్పారామం, చిత్రావతి పరివాహక ప్రాంతం, ఆంజనేయ స్వామి విగ్రహం పరిసరాల్లో పర్యటించారు. అనంతరం కలెక్టర్ టీఎస్ చేతన్‌ను కలసి పుట్టపర్తిలో పర్యాటక రంగం అభివృద్ధిపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి ప్రాంతాన్ని సుందరీకరణ అభివృద్ధి పనులు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులతో అభివృద్ధి చేయాలని, పుడా పరిధిలో ఉన్న 14 పార్కులను అభివృద్ధికి తగిన తోడ్పాటు నివ్వాలని కోరారు. తమ కంపెనీ ద్వారా పుట్టపర్తి పర్యాటక రంగ అభివృద్ధికి తగిన నిధులు ఇచ్చి సహాయసహకారాలు అందిస్తామని జోయాలుక్కాస్ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

పట్టణానికి దూరంగా పందుల పెంపకం

- వారంలోపు తరలించాలని కమిషనర్ ఆదేశం


పందుల యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్

ధర్మవరం అర్బన్: పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పందులను పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పందుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో పందుల సంచారంపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పందులతో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. పందులను వారంలోపు పట్టణానికి 5 కిలోమీటర్ల దూరానికి తరలించి పెంచుకోవాలని సూచించారు. బడన్నపల్లి దగ్గర పందుల పెంపకానికి స్థలం ఏర్పాటు చేశామని తెలిపారు. పెంపకందారులు నెలవారీ బాడుగ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా ఈ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసన్, కేశవ, మేస్త్రీలు ఆదినారాయణ, నరసింహులు, పార్థసారథి, సచివాలయ శానిటరీ కార్యదర్శులు, పందుల యజమానులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట


కొలువుదీరిన సీతారామ లక్ష్మణులు


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నల్లమాడ: సోమగుట్టపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వేదపండితులచే పూజా కార్యక్రమాలు నిర్వహించి మూడో రోజున విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, ప్రధాన కలశాభిషేకం, ప్రాణప్రతిష్ట బింబకళాన్యాసం, వేదపారాయణం, పంచామృతాభిషేకం, సీతారాముల కల్యాణం, అశ్వత్థ వివాహ కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాణాన్ని తిలకించి పరవశులయ్యారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు భక్తులకు అన్నదానం చేశారు.

యువతకు ఉచిత కోచింగ్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎర్రగుంట కాలనీ వద్దనున్న యశోద స్కూల్‌లో యువతీ యువకులకు ఉచిత కోచింగ్ నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ పృథ్వీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌కమ్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి వారిచే యువతీ యువకులకు 11వ ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, కెరీర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భయం లేకుండా ఇంగ్లిష్ మాట్లాడించడం, నిర్దిష్టమైన జీవిత లక్ష్యం, సాధించే మార్గం, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలపై బోధన, పోటీ పరీక్షల సిలబస్, తయారీ విధానం, చేధించే మార్గం, వ్యాపారాలు, స్టార్టప్స్ ఏర్పాటు తదితర వాటిపై ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ నెల 16 నుంచి 21 రోజులపాటు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే ఉచిత శిక్షణలో డిగ్రీ చదువుతున్న, పూర్తి చేసిన వారు, పీజీ, బీటెక్ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. ఉచిత స్టడీ మెటీరియల్, మధ్యాహ్న భోజనం, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తున్నామని తెలిపారు.

ఫైనల్‌కు కదిరి, అనంత జట్లు


గిరినాథరెడ్డి (67 పరుగులు)


దత్తా రెడ్డి (3 వికెట్లు)

అనంతపురం: సీనియర్ క్రికెటర్ ఎస్.చంద్రమోహన్ స్మారకార్థం నిర్వహిస్తున్న సీనియర్ టీ–20 క్రికెట్ టోర్నీలో కదిరికి చెందిన ఏడీసీఏ క్యాంప్ జట్టు, అనంత రైజింగ్ స్టార్ జట్టు ఫైనల్‌కు చేరాయి. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో కదిరి, జీఎస్‌జీ అనంతపురం జట్లు తలపడ్డాయి. కదిరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. జట్టులో బ్యాటర్ పి.గిరినాథరెడ్డి 49 బంతుల్లో 67 పరుగులు సాధించాడు. మరో బ్యాటర్ వెంకట సాయి 31 బంతుల్లో 48 పరుగులతో జట్టుకు మంచి స్కోరు అందించాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జీఎస్‌జీ అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 144 పరుగులు చేసి ఓటమి పాలైంది.

- అనంత రైజింగ్ స్టార్, ఫ్యామిలీ క్లబ్ అనంతపురం జట్ల మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రైజింగ్ స్టార్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. జట్టులో బి.ప్రశాంత్ 37 పరుగులు, లోహిత్ సాయి కిశోర్ 22 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఫ్యామిలీ క్లబ్ జట్టు 18.5 ఓవర్ల వద్ద 121 పరుగులకు కుప్పకూలింది. కేహెచ్ వీరారెడ్డి 27 బంతుల్లో 48 పరుగులు, వెంకట్ లోకేష్ 20 పరుగులతో రాణించినా ఫలితం దక్కలేదు. రైజింగ్ స్టార్ బౌలర్ దత్తారెడ్డి అద్భుతమైన బౌలింగ్‌తో మూడు వికెట్లు తీసి ఫ్యామిలీ క్లబ్ జట్టును తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు.

లక్ష్యం నీరుగారుతోంది!


కట్టకిందపల్లిలో రోడ్డు పక్కన నీరు లేక వృథాగా ఉన్న తొట్టె

ధర్మవరం రూరల్: వేసవిలో పశువుల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నీటి తొట్టెలు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఒక్కొక్క తొట్టెను రూ.30 వేల వ్యయంతో ధర్మవరం మండల వ్యాప్తంగా 80 తొట్టెలు నిర్మిస్తోంది. వేసవి ప్రారంభంలో పనులు ప్రారంభించినా నేటికీ కొన్ని గ్రామాల్లో తొట్టెలు నిర్మాణ పనులు ప్రారంభమే కాలేదు. మరికొన్ని గ్రామాల్లో నిర్మించినా అందులోకి నీరు వదలలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం ఆచరణలో నీరుగారిపోతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి

ముదిగుబ్బ: మండలంలో 2014–19 మధ్య కాలంలో మంజూరైన పక్కా గృహాల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతు మండల వ్యాప్తంగా సుమారు 1,212 మందికి దాదాపు రూ.1.65 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లుల చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు.

19న ఎంపీపీ ఎన్నిక

గాండ్లపెంట: మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ) ఎన్నిక ఈ నెల 19న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి విజయ్‌ప్రసాద్ బుధవారం తెలిపారు. ఎంపీపీ ఎన్నికల నోటిఫికేషన్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించామన్నారు. ఎంపీటీసీలందరికీ నోటీసులు అందించామని ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు.

పార్నపల్లి నుంచి తాగునీరు 4 రోజులు బంద్

కదిరి టౌన్: పార్నపల్లి చిత్రావతి రిజర్వాయర్ నుంచి కదిరికి వచ్చే తాగునీరు ఈ నెల 15 నుంచి 4 రోజులపాటు బంద్ కానున్నాయి. పంప్‌హౌస్‌లో మెయిన్ పైప్‌లైన్–మోటార్ దెబ్బతింది. మరమ్మతుల నేపథ్యంలో గురువారం నుంచి 18 వరకు పార్నపల్లి తాగునీరు సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

పరామర్శ


ఉమను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విశ్వ

కదిరి టౌన్: చిప్పలమడుగు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరెడ్డి భార్య ఉమ అనారోగ్యంతో కదిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి బుధవారం ఆస్పత్రికి వచ్చి ఉమను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, కదిరి వైఎస్సార్‌సీపీ నాయకులు జైనుల్లా, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

నల్లచెరువు: కె పూలకుంట మాజీ సర్పంచ్ అక్బర్ తండ్రి, వైఎస్సార్‌సీపీ నేత పెద్ద మదార్‌వలి (80) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు అత్తార్ చాంద్‌బాషా, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి మదార్‌వలి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్‌ను పరామర్శించి, ధైర్యం చెప్పారు.

స్నేహితుని జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ


మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణవేణి

తాడిమర్రి: శివంపల్లికి చెందిన చారుగుండ్ల రవితేజ గత ఏడాది మృతి చెందాడు. దీంతో స్నేహితులు ఎం.గంగాధర్, జి.రాజ్‌కుమార్, జి.సతీష్, డి.హరీష్, డి.నాగరాజు తదితరులు రవితేజ జ్ఞాపకార్థం మండల కేంద్రం తాడిమర్రిలో బుధవారం క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ కృష్ణవేణి హాజరై టోర్నీని ప్రారంభించారు. స్నేహితుని జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. 16 రోజులపాటు సాగే టోర్నీలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మొత్తం 30 జట్లు పాల్గొంటున్నాయి. విజేత జట్టుకు రూ.40,116, రన్నరప్ జట్టుకు రూ.20,116 నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎ.పక్కీరరెడ్డి, ఎం.వినోద్ కుమార్, శివంపల్లి బీసీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

తాడిమర్రి: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు పార్నపల్లి నారాయణ తహసీల్దార్‌ను కోరారు. ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును బుధవారం సీఐటీయూ నాయకులు కార్యకర్తలతో కలసి తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి అందజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అలాగే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విశాఖ స్టీల్, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, అధిక ధరలు అరికట్టాలని, ఆటో, హమాలీ తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాత్రి 10 గంటలకు షాపులు మూసేయాలి

కదిరి టౌన్: పట్టణంలో రాత్రి పది గంటలకు అన్ని వ్యాపార దుకాణాలూ మూసివేయాలని సీఐ వి.నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఇదివరకే దుకాణదారులకు ఈ విషయాన్ని తెలియజేశామన్నారు. అయితే కొన్నిచోట్ల పోలీసులు రాత్రి రౌండ్స్ పూర్తవగానే దుకాణాలు తెరుస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి షాపుల నిర్వాహకులపై కఠినంగా వ్యవహరించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దుర్గాంబ జాతర ప్రారంభం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీత

రామగిరి: మండలంలోని నసనకోటలో బుధవారం దుర్గాంబ జాతర ప్రారంభమైంది. గ్రామదేవతలైన గంగమ్మ, దుర్గమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, పోతులయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద సుమారు రూ.40 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన రక్షణగోడ, రైలింగ్, నాగులకట్ట, అదనపు సౌకర్యాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. ఈనెల 18 వరకూ జాతర జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.